

ఆర్డీఓలు బదిలీ

ఉమ్మడి జిల్లాలో నలుగురికీ స్థానం చలనం

- అనకాపల్లికి షేక్ ఆయేషా, నర్సీపట్నానికి వెంకట రమణ
- ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని చిన్నికృష్ణ, జయరామ్‌లకు ఆదేశాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 26: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నలుగురు ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరితోపాటు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, వీఎంఆర్డీఏ కార్యదర్శికి కూడా స్థానచలనం కల్పించారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ ... మిగతా 8వ పేజీలో

పర్యాటకంపై శీతకన్ను

సందర్శనీయ ప్రదేశాలపై వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం

- ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి పనులు
- ఐదేళ్లపాటు పడకేసిన పర్యాటకం
- కళావిహీనంగామారిన సందర్శనీయ ప్రాంతాలు
- పూర్వ వైభవానికి కూటమి ప్రభుత్వం చర్యలు
- ప్రతిపాదనలు పంపాలని జిల్లా అధికారులకు ఆదేశాలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి రమణీయ దృశ్యాలకు నెలవైన అనకాపల్లి జిల్లాలోని పలు పర్యాటక ప్రదేశాలు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్రనిర్లక్ష్యానికి గురయ్యాయి. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లు దాటినా పర్యాటక ప్రగతి శూన్యం. నాటి వైసీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రకటనలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి అభివృద్ధి చేయలేదు. ఈ నేపథ్యంలో మూడున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కోసం పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించింది. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, వాటి స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని కొండకర్ల ఆవ

కొండకర్ల ఆవ వెలవెల

చుట్టూ పచ్చని కొండలు, మధ్యలో మంచి నీటి సరస్సు, పలు రకాల పక్షులకు ఆలవాలమై, సహజసిద్ధ అందాలతో భూతల స్వర్గాన్ని తలపించే కొండకర్ల ఆవ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయ డంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. అనకాపల్లికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న నాటి వైసీపీ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు మాటలు నీటిమూటలుగానే మిగిలాయి.



బొజ్జన్న కొండపై బుద్ధుని శిల్పాలు

ఉత్తరాంధ్రలో అతిపెద్ద మంచినీటి సరస్సుగా గుర్తింపు పొందిన కొండకర్ల ఆవ ఆక్రమణలకు గురై, కుంచించుకు పోతున్నది. పూడి, గుర్రపుడెక్క ఆకు, నాచుతో నిండిపోయి ప్రభవాన్ని కోల్పోతున్నది. ఒకప్పుడు ఎన్నో రకాల పక్షులు సైబీరియా ప్రాంతం నుంచి శీతాకాలంలో ఇక్కడకు వచ్చి గుడ్లుపెట్టి, పిల్లలను పొదిగిన, అవి పెరిగిన తరువాత వేసవికి ముందు తిరిగి వెళ్లిపోయేవి. కానీ కొంతకాలం నుంచి పక్షుల రాక తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. లేదు. గతంలో కొండకర్ల ఆవలో బోటు షికారు సదుపాయం వుండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బోట్లు మూలకుచేరాయి. పర్యాటకులు ఆవలో చేపల వేట సాగించే మత్స్యకారులో నాటు పడవల్లోనే ఆవలో విహరించాల్సి వస్తున్నది. కొండకర్ల ఆవ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నాటి ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొండకర్లను ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని జిల్లా అటవీ, మత్స్య, పర్యాటక శాఖల ధికారులను ఆదేశించింది.



ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం

సముద్ర తీరంలో కళ తప్పిన పర్యాటకం



పూడిమడక సముద్ర తీర ప్రాంతం

జిల్లాలో పరవాడ మండలం నుంచి పాయకరావుపేట మండలం వరకు సుదీర్ఘ సముద్ర తీర ఉంది. ప్రతి ఆదివారంతోపాటు కార్తీక మాసంలో సముద్ర తీరంలోని పలు ప్రదేశాల వద్ద జన సందడి వుంటుంది. తంతడి బీచ్‌లో సినిమా షూటింగ్‌లు తరచూ జరుగుతుంటాయి. కానీ ఇక్కడ సినిమా షూటింగ్‌లకు వచ్చే నటీనటులు, సాంకేతిక నిపుణులు రాత్రి విడిది చేయాలంటే అటు విశాఖపట్నం, లేదంటే ఇటు అనకాపల్లి వెళ్లాల్సిన పరిస్థితి. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం తీర ప్రాంతానికి పెద్ద సంఖ్యలో పర్యా టకులు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడుపుతుంటారు. ఇక్కడ పర్యాటకులకు కనీస సదుపాయాలు లేవు. అచ్యుతాపురం మండలం పూడిమండక తీరంలో పర్యాటక అభివృద్ధికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపిందించింది. తరువాత వైసీపీ అధికారంలోకి ... మిగతా 8వ పేజీలో

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బూడి ముత్యాలనాయుడు

అనకాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):



వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడును పార్టీ అధిష్ఠానం నియమి ంచింది. ఈ మేకు గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. మునగపాక మండలానికి చెందిన బొడ్డేడ ప్రసాద్ ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షునిగా వున్నారు. ఆయనను తప్పించి, బూడి ముత్యాల నాయుడుకు పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలైన సంగతి తెలిసిందే. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు.

మరో ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పలువురు తహసీల్దార్లకు బదిలీలు చేస్తూ కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పద్మనాభం తహసీల్దార్ ఎం.ఆనందకుమార్‌ను పెందుర్తి, పెందుర్తి తహసీల్దార్ కె.వేణుగోపాల్‌ను వీఎంఆర్‌డీఏకు స్పెషల్ తహసీల్దార్‌గా వేశారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం తమసీల్దార్ బి.రవికుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపించారు. వీఎంఆర్‌డీఏలోని కె.ఆనందరావును పద్మనాభం వేశారు. అల్లూరి జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ బి.చిన్నికృష్ణను అనకాపల్లి జిల్లాకు పంపించారు.

పండగల నెలలో రేషన్ కోత

- అక్టోబరులో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ
- గోధుమ పిండి, కందిపప్పు సరఫరా చేయని అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 26:



అక్టోబరు నెల రేషన్‌లో కందిపప్పు, గోధుమ పిండికి పౌరసరఫరాల అధికారులు కోత పెట్టారు. పౌర సరఫరాల గోదాములకు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేశారు. ఒక పక్క నిత్యవసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వంట నూనె ధర నెలలో రెండుసార్లు పెరిగింది. అక్టోబరులో ప్రధానమైన దసరా, దీపావళి పండగలు వున్నాయి. ఇటువంటి సమయంలో రేషన్ డిపోల ద్వారా కందిపప్పు, గోధుమ పిండి సరఫరా చేయక పోవడం విమర్శలకు దారి తీస్తున్నది.

జిల్లాలో 1,069 డిపోల పరిధిలో 5.47 లక్షల రేషన్ కార్డులు వున్నాయి. వీరికి ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం, పంచదార, గోధుమ పిండి, కందిపప్పు వంటి వాటిని సరఫరా చేస్తుంటారు. ఆయా సరకులను ప్రతి నెలా పౌరసరఫరాల గోదాముల నుంచి రేషన్ డిపోలకు పంపుతారు. అక్కడ నుంచి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కార్డుదారులకు ... మిగతా 8వ పేజీలో

ప్రయాణం దుర్లభం!

వర్షాలతో మరింత ఛిద్రమైన బీఎన్ రోడ్డు

- చెరువులు, పంట కుంటలను తలపిస్తున్న గోతులు
- వాహనదారులు, ప్రయాణీలపాట్లు వర్ణనాతీతం



చోడవరంలో కొత్తూరు జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

చోడవరం, సెప్టెంబరు 26:

కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు.. చోడవరం నియోజకవర్గంలోని బీఎన్ రోడ్డులో ప్రయాణం దుర్లభంగా మారుతున్నది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో పలుచోట్ల ఏర్పడిన భారీ గోతుల్లో వర్షం నీరు చేరి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. కొన్నిచోట్ల రెండు, మూడు అడుగుల లోతున గోతులు వుండడంతో సరకు రవాణా వాహనాలు కూరుకుపోతున్నాయి. చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌తోపాటు, అంబేరుపురం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు వర్షం నీటితో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. కొత్తూరు జంక్షన్ సమీపంలో రోడ్డు ఎత్తుకావడం, వర్షం నీరు పోవడానికి వీలు లేకుండా ఇరువైపులా కాలువలను మూసి వేయడంతో నీరంతా రోడ్డుపైనే ఉండిపోతున్నది. ఇక్కడ గతంలో రెండుసార్లు సిమెంట్ కాంక్రీట్, క్రషర్ బుగ్గి వేసి చదును చేసినప్పటికీ, వర్షం నీరు పోయేదారిలేక కాంక్రీట్ కొట్టుకుపోతున్నది.

బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది నుంచి కోమళ్లపూడి వరకు అడుగడుగునా భారీ గోతులు ఏర్పడి , వర్షంనీటితో పంట కుంటలను తలపిస్తున్నాయి. బంగారుమెట్ట, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, బూదిరెడ్లపాలెం, కోమళ్లపూడి కూడలిలో తారు రోడ్డు ఆనవాళ్లు లేదు. ఈ మార్గంలో ... మిగతా 8వ పేజీలో



బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం వద్ద చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి



బుచ్చెయ్యపేట మండలం ఎల్.సింగవరంలో పూర్తిగా ఛిద్రమైన బీఎన్ రోడ్డు

ఎలమంచిలి-గాజువాక రోడ్డు అధ్వానం

పరవాడ మండలంలో పలుచోట్ల భారీ గోతులు



పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో దారుణంగా వున్న రహదారి

పరవాడ, సెప్టెంబరు 26:

ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలో పరావాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో ఏర్పడిన భారీ గొయ్యి ప్రమాద కరంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి చెరువుల్లా మారాయి. ధర్మారాయుడుపేట, బొట్టవానిపాలెం జంక్షన్‌ల వద్ద కూడా గోతులు ఏర్పడ్డాయి. ఏ గొయ్యి ఎంత లోతు వుందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు, సరకు రవాణా వాహనాలు గోతుల్లో కూరుకుపోతున్నాయి. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్‌కు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై గుంతలను పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 :

వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో మండలంలోని ఎం.కోటపాడు, ఎం.కెవల్లాపురం- ఘాట్‌రోడ్డు జంక్షన్, ముకుందపురం- కేజేపురం జంక్షన్ మధ్య పలుచోట్ల గోతులు ఏర్పాడ్డాయి. వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల విడిభాగాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. రాత్రి పూట ఎక్కడ గొయ్యి వుందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు.



ఎం.కె.వల్లాపురం -ఘాట్‌రోడ్డు జంక్షన్ మధ్య ధ్వంసమైన రహదారి

ఎసెన్షియాకు హైలెవెల్ కమిటీ

గత నెల ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతం పరిశీలన

- సినర్జిన్ పరిశ్రమ కూడా సందర్శన
- ఫార్మా కంపెనీల ప్రతినిధులతో చైర్‌పర్సన్ వసుధామిశ్రా సమావేశాలు
- అందరి సహకారంతోనే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సాధ్యమని వెల్లడి
- సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ-మెయిల్, వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు

అనకాపల్లి/రాంబిల్లి/పరవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా రాంబిల్లి, పరవాడ మండలాల్లోని ఫార్మా కంపెనీల్లో ఇటీవల జరిగిన ప్రమాదాలపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను కంపెనీల ప్రతినిధులు, కార్మికులు, ఉద్యోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అచ్యుతాపురం సెజ్‌లో గత నెలలో భారీ ప్రమాదం సంభవించిన ఎసెన్షియా ఫార్మా కంపెనీని ఉన్నతస్థాయి కమిటీ సందర్శించింది. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా సమీపంలో ఉన్న లారస్ ల్యాబ్స్ యూనిట్-2లోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదంపై కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీకి వివరించారు. అనంతరం వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో సమావేశమై సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్‌పర్సన్ వసుధామిశ్రా మాట్లాడుతూ, అందరి సహకారం, భాగస్వామ్యంతోనే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందన్నారు. ఒక కంపెనీలో ప్రమాదం జరిగితే ఆ ప్రభావం పక్క కంపెనీలపైనా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ-మెయిల్, వాట్సాప్ గ్రూపుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కమిటీ కన్వీనర్‌కు సూచించారు. సూచనలు, సలహాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ... మిగతా 8వ పేజీలో



అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఉన్నత స్థాయి కమిటీ చైర్‌పర్సన్ వసుధామిశ్రా, కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

క్రైం... crime news

కొత్తపెంటలో పిడుగు పడి రైతు మృతి

దేవరాపల్లి, సెప్టెంబరు 26: మండలంలోని కొత్తపెంటకు చెందిన సూరెడ్డి అప్పలనాయుడు (38) అనే రైతు పిడుగు పడి మృతి చెందాడు. గురువారం పొలంలోకి వెళ్లి గడ్డి మోసుకు వస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, కుమారుడు వరుణ్ (7) ఉన్నారు. అప్పటివరకూ ఎండ ఉధృతంగా కాయగా, అంతలోనే ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది. దీంతో పిడుగు పడడంతో అప్పలనాయుడు మృతి చెందగా, గ్రామంలో విషాదం నెలకొంది.

ఫార్మా కార్మికుడి అనుమానాస్పద మృతి

లంకెలపాలెం, సెప్టెంబరు 26: అనుమానాస్పదంగా ఓ ఫార్మా కార్మికుడు గురువారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశ్వజీత్ రాబర్(25) తన సోదరుడు సూరజ్ రాబర్‌తో కలిసి లంకెలపాలెం కూడలిలో ఓ ఇంట్లో నివాసముంటూ ఫార్మాసిటీలో గల ఓ పరిశ్రమలో కూలి పనులు చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో విశ్వజిత్ రాబర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న సోదరుడు సూరజ్ మందుల కోసం కూడలిలో మెడికల్ షాప్‌నకు వెళ్లాడు. ఆ సమయంలో దుకాణాలు మూసి ఉండడంతో తిరిగి రూమ్‌కు వెళ్లాడు. అప్పటికే విశ్వజీత్ ఇంటి బయటకు వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం సోదరుడు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విశ్వజీత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తూరు, సెప్టెంబరు 26 : రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా వున్నాయి. కశింకోట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ఉంది. అతను సిమెంటు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంటు ధరించి చామనఛాయ రంగులో ఉన్నాడు. 5.3 అడుగుల ఎత్తు ఉంటాడు. సంఘటన స్థలంలో అతనికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీనిపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే 7382058996 ఫోన్ నంబరుకు తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని మాసాహెబ్‌పేట వద్ద బుధవారం తాండవ నదిలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం రాజవరం సమీపంలో తాండవ నది దిబ్బల్లో లభ్యమైనట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్(27) బుధవారం తాండవ నది అవతల ఒడ్డున ఉన్న తమలపాకుల తోటలో తమలపాకుల కోతకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మాసాహెబ్‌పేట వద్ద తాండవ నదిపై రాకపోకలు సాగించడానికి రైతులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న స్తంభాల వంతెన మీద నుంచి వస్తూ జారి పడి గల్లంతైన సంగతి తెలిసిందే. బుధవారం పోలీసులు, యువకుడి బంధువులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ తెలియలేదు. గురువారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా రాజవరం సమీపంలో తాండవ నదిలో పందేల దిబ్బలలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆస్పత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26: గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి ఒక ఉద్యోగి నుంచి అధిక మొత్తంలో కాజేసిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానికంగా ఉన్న ఒక బ్యాంక్ ఉద్యోగి జి. వేణుగోపాలకృష్ణ వాట్సాప్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి యాడ్ చేశాడన్నారు. ఈ వాట్సాప్‌లో 150 మందికి పైగా ఉన్నారని, ఈ గ్రూప్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించాడన్నారు. దీంతో వేణుగోపాలకృష్ణ దఫదఫాలుగా రూ.15 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టాడన్నారు. అంతలోనే ఆ వాట్సాప్ గ్రూప్ నుంచి అందరూ మాయం కావడంతో సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. సైబర్‌సెల్ అధికారులు వేణుగోపాలకృష్ణ వేసిన మొత్తంలో రూ. 5.35 లక్షలు ఫ్రీజ్ చేశారని, ఈ సంఘటన పై వేణుగోపాలకృష్ణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళా రైతు హత్య కేసులో నిందితుడి అరెస్టు

గొలుగొండ, సెప్టెంబరు 26: సాగునీటి వివాద నేపథ్యంలో మహిళపై దాడి చేసి ఆమె ప్రాణాలు పోవడానికి కారకుడైన నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ గ్రామపంచాయతీ పరిధి శ్రీరాంపురంలో బుధవారం ఉదయం పొలం వద్ద రైతు దంపతులు రామకృష్ణ, రామలక్ష్మి (42)పై అదే గ్రామానికి చెందిన చిటికెల తాతీలు కత్తితో దాడికి దిగిన సంగతి తెలిసిందే.. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలైన రుత్తల రామలక్ష్మి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని బంధువులకు గురువారం అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడు తాతీలును అరెస్టు చేసి అనకాపల్లి సివిల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడు మృతురాలికి పెదనాన్న అవుతాడని గుర్తించినట్టు ఎస్ఐ చెప్పారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

కోటవురట్ల, సెప్టెంబరు 26: కోటవురట్లలో పోలీసులు బుధవారం రాత్రి ఓ బెల్టు షాపుపై దాడి చేసి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు న్నారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ గంగారాజు తెలిపిన వివ రాలు ఇలా వున్నాయి. కోటవురట్ల గ్రామానికి చెందిన పినపాత్రుని మాధవి బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు వారు బెల్టు షాపుపై దాడి చేసి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

కొంగసింగి జంక్షన్‌లో ఏడు మద్యం బాటిళ్లు..

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 26: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని కొంగసింగి జంక్షన్‌లో 7 మద్యం క్వాటర్ బాటిళ్లతో వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్ఐ టి.దివ్య తెలిపారు. చోద్యం గ్రామానికి చెందిన చింతల రమణ (65) బెల్ట్‌షాపులో విక్రయించేందుకు మద్యం తీసుకొనివెళుతుండగా పట్టుబడినట్టు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

జి.వెంకటాపురం వద్ద లారీ బోల్తా

మాకవరపాలెం, సెప్టెంబరు 26: నల్లరాయి లోడుతో వెళుతున్న లారీ మండలంలో జి.వెంకటాపురం వద్ద బోల్తా పడింది. జి.కోడూరు రెవెన్యూలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలో ఉంచి రోజూ రాంబిల్లి మండలంలో నేవల్‌బేస్ పనులకు నల్లరాయి తరలిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం ఉదయం లోడుతో వస్తున్న లారీ జి.వెంకటాపురం వద్ద ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోయి బోల్తా పడింది. లారీ డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయి.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నాతవరం, సెప్టెంబరు 26: మండలంలోని పి.జగ్గంపేట సమీపంలో పేకాటడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.8500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భీమరాజు తెలిపారు. పి.జగ్గంపేటలో గ్రామదేవత జాతర సందర్భంగా కొందరు పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

విశాఖలో మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్

- పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరణ
- కాంట్రాక్టు నర్సుల సమస్యలు పరిష్కరించాలని కోరిన ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ
- వైసీపీ హయాంలో దళితులపై జరిగిన హత్యాకాండపై విచారణ చేయాలన్న దళిత సంఘాల ఐక్య వేదిక
- జర్నలిస్టులకు నాలుగు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని
- జర్నలిస్టు సంఘాల వినతి
- సమస్యల పరిష్కారానికి హామీ


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి విచ్చేసిన ఆయన తొలిరోజు సీఐఐ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం అదానీకి డేటా సెంటర్ నిమిత్తం మధురవాడ ప్రాంతంలో కేటాయించిన కొండను పరిశీలించారు. ఆ తరువాత ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాడిసన్ హోటల్‌లో సమావేశమై ఉక్కు కర్మాగారం సమస్యపై చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. గురువారం ఉదయం సింహాచలం వెళ్లి వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్న లోకేశ్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినతులను స్వీకరించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. పరస్పర అంగీకార బదిలీలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు రిటైరైన వారికి పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన వారికి పరిహారం అందించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్‌సర్వీస్‌మన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాలను వైసీపీ అండతో కొందరు ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి అనేవారు మంత్రిని కలిశారు. డీఎస్సీ 2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యా దీవెన కింద బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే కారణంతో గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల వేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. డాక్టర్ సుధాకర్, ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్ హత్య, కోడికత్తి శ్రీను కేసులను ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, నేతలతో మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. మంత్రితో ఫొటోలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహాన్ని చూపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కొండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

పాడేరు డివిజన్‌లో 146 పశు వైద్యాధికారుల పోస్టులు ఖాళీ

చీడికాడ, సెప్టెంబరు 26: అల్లూరి సీతారామరాజు జిల్లాలోనా పాడేరు డివిజన్ పరిధిలో 146 పశువైద్య అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పశుసంవర్ధక శాఖ పాడేరు డివిజన్ ఉపసంచాలకులు సీహెచ్ నర్సింహులు తెలిపారు. మండలంలోని ఖండివరం పశువైద్య కేంద్రాన్ని మాడుగుల పశువైద్యశాఖ ఏడీ చిట్టినాయుడుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ పాడేరు డివిజన్ అల్లూరి జిల్లాలో 700 పోస్టులకు 599 మంది సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలో గల తమ డివిజన్ పరిధిలో ఎనిమిది మండలాలు ఉండగా, 25 పశువైద్యాధికారుల పోస్టులకు నాలుగు ఖాళీగా ఉన్నాయన్నారు. అల్లూరి జిల్లాలో 44 పశువైద్య డాక్టర్లు అవసరం కాగా, 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అల్లూరి జిల్లాలో 700 గోకులం షెడ్లకు రైతులు దరఖాస్తులు చేయగా, అందులో 220 షెడ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లూరి జిల్లాలో 22 పశువులు, 99 గొర్రెలు, మేకలు, 12 లేగదూడలు, 150 కోళ్లు మృతి చెందినట్టు చెప్పారు. నష్టపరిహారం కింద రూ.22 లక్షల 40 వేల 500లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మిశ్రమ దాణా పశువులకు తినిపిస్తే అధిక పాలదిగుబడి పొందవచ్చని సూచించారు. ఆయన వెంట ఖండివరం పశువైద్యాధికారి ఎ.గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ చదువులు

- ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


తరగతి నిర్వహిస్తున్న తుఫాన్ షెల్టర్ భవనం


తరగతి గదిలో శ్లాబు పెచ్చులూడుతున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 26: ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చాలీచాలని గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. గదులు చాలక ఓ తరగతిని శిథిల స్థితిలో ఉన్న తుఫాన్ షెల్టర్‌లో నిర్వహిస్తున్న దయనీయ పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉండేది. హుద్‌హుద్ తుఫాన్‌కు ఈ పాఠశాల భవనాలు దెబ్బతినడంతో పదేళ్ల క్రితం రైల్వే స్టేషన్ రోడ్డులోని జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చు చేశారు. దీంతో జడ్పీ హైస్కూల్ ఆవరణలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయి. జడ్పీ హైస్కూల్‌కు సౌకర్యాలు బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేటాయించిన భవనంలో ఏడు తరగతి గదులు ఉన్నాయి. మరో తరగతిని అక్కడే ఉన్న తుఫాన్ షెల్టర్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ తుఫాన్ షెల్టర్ భవనంలో 8వ తరగతిని నిర్వహిస్తున్నారు. ఈ గది శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. దీనిపై ఎంఈవో-1 మీనాక్షిని వివరణ కోరగా పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయించాల్సి ఉందని తెలిపారు.

తాగునీరు కలుషితం

- నర్సీపట్నంలో కొళాయిల నుంచి బురద నీరు సరఫరా
- వర్షాలే కారణమంటున్న అధికారులు


ధనిమిరెడ్డి వీధిలో పబ్లిక్ కొళాయి నుంచి వస్తున్న బురద నీరు

నర్సీపట్నం, సెప్టెంబరు 26 : మునిసిపాలిటీలో ప్రజలకు కొళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతున్నది. గురువారం ఉదయం కొళాయిల నుంచి వచ్చిన నీరు లేత ఎరుపు రంగులో బురదగా వుండడంతో ప్రజలు ఆందోళన చెందారు. అంటురోగాల బారిన పడతామేమోన్న భయంతో కొంతమంది కొళాయిల నీటిని పట్టుకోవడానికి సంకోచించారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం ప్రాంతాలకు దుగ్గాడ, ఉత్తరవాహిని మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంటారు. వరహా నది నీటి లభ్యత ఆధారంగా తాగునీటి పథకాలు పని చేస్తున్నాయి. కాగా వర్షాల కారణంగా నదిలో కొత్తనీరు చేరడంతో కొళాయిల ద్వారా బురద నీరు వస్తున్నదని అధికారులు అంటున్నారు.

78 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

కె.కోటపాడు, సెప్టెంబరు 26: మన్యం ప్రాంతం నుంచి దేవరాపల్లి, కె.కోటపాడు మీదుగా గంజాయిని తరలిస్తున్న ముఠాను మండలంలోని బత్తివానిపాలెం జంక్షన్‌లో పట్టుకున్నట్టు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం చూడగా ఒడిశాకు చెందిన సుఫారా మండల్ (48), ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన జి.దేవానంద్ (28) కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిద్దరినీ అరెస్టు చేసి 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. కారును సీజ్ చేసినట్టు తెలిపారు. నిందితులను చోడవరం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 26: వడ్డాది కూడలిలో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు పట్టుబడినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను కృష్ణాజిల్లా బంటుమల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించామని, వీరి నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవదానం


సంతోష్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 26: తాను మరణిస్తూ ఇద్దరి జీవితాలకు ఓ యువకుడు వెలుగునిచ్చాడు. వివరాలివి... అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన బి.సంతోష్ ఈ నెల 22న తీవ్రమైన తలనొప్పితో నగరంలోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో చేరాడు. అతని తలలో రక్తస్రావం జరిగిందని వైద్యులు గుర్తించారు. అనంతరం అతడు అపస్మారక స్థితికి చేరాడు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఈ విషయాన్ని యువకుడి తండ్రి సత్తిబాబుకు తెలియజేసి, అవయవదానంపై అవగాహన కల్పించారు. అంతకష్టంలోనూ కుమారుడి అవయవదానానికి తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో యువకుడి కాలేయాన్ని కేర్ ఆస్పత్రికి, ఊపిరితిత్తులను గ్రీన్ ఛానెల్ ద్వారా హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

'తాండవ'కు వరద తాకిడి

రెండు గేట్లు ఎత్తి 1,200 క్యూసెక్కులు విడుదల


స్పిల్‌వే గేట్ల నుంచి నదిలోకి విడిచిపెడుతున్న నీరు

నాతవరం, సెప్టెంబరు 26 : పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లోకి వరద ఉధృతి పెరిగింది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, గురువారం 1,380 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. దీంతో నీటిమట్టం 378.2 అడుగుల వద్ద స్థిరంగా వుంచుతూ స్పిల్‌వే గేట్లు రెండింటిని ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కుడి, ఎడమ కాలువలకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

కారిడార్ నిర్వాసిత రైతుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

నక్కపల్లి, సెప్టెంబరు 26: విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు అన్యాయం చేయకూడదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు అన్నారు. గురువారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అమలాపురం పంచాయతీ పరిధిలోని మూలపర్ర, పాటిమీద గ్రామాలకు చెందిన నిర్వాసితులతో కలిసి ఆందోళన చేశారు. ఈ గ్రామాల్లోని నిర్వాసిత రైతులకు ప్యాకేజీ చెల్లించేందుకు 2010 డిసెంబరు 29 కటాఫ్ తేదీగా రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు ప్రకటించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటారో ? అప్పుడే కటాఫ్ తేదీని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురునాథ్, నానాజీ, శ్రీనివాస్, గోవిందరావు పాల్గొన్నారు.

నేడు బొజ్జన్నకొండ వద్ద ధ్యాన మందిరం ప్రారంభం


బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యాన మందిరం

తుమ్మపాల, సెప్టెంబరు 26 : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యాన మందిరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అలాగే లేజర్ థియేటర్, లైటింగ్ అండ్ సౌండ్ షో, ప్రధాన ముఖద్వారాన్ని కూడా ప్రారంభించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు పర్యాటకశాఖ జిల్లా ఈఈ రమణ తెలిపారు.

సీఎంను కలిసిన మాజీ మంత్రి దాడి


సీఎంతో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు, రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26: అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వరదలు సంభవించి నప్పుడు రేయింబవళ్లు చంద్రబాబు కష్టపడిన తీరును వారు కొనియాడారు.

జిల్లాలో తేలికపాటి జల్లులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. రోజంతా వాతావరణ చల్లబడడంతో పాటు ఏదో ఒక సమయంలో కొద్దిసేపు ఒక మోస్తరు వాన కురిసి తరువాత తెరిపివ్వడంతో జనజీవనానికి ఇబ్బందులు తప్పలేదు. కోటవురట్లలో కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. కృష్ణాదేవిపేట, నాతవరం మండలాల్లో మధ్యాహ్నం వరకు వర్షం పడింది. తరువాత తెరిపిచ్చింది. తాండవ జాలశయంలోకి వరద నీరు చేరడంతో 1200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

ముగిసిన సదరం క్యాంపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. చివరి రోజు అర్హులుగా 35 మందిని గుర్తించినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎస్.రాయవరం, మాకవరపాలెం మండలాల నుంచి 53 మంది శిబిరానికి హాజరైనట్టు చెప్పారు. వైద్యులు గంగాధర్, కనకదుర్గ, అశోక్‌కుమార్ పరీక్షలు జరిపారన్నారు. ఇదిలావుంటే, ఇప్పటి వరకు ఇక్కడ నిర్వహించిన ఈ శిబిరాలకు 711 మంది హాజరు కాగా, అందులో 530 మందిని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు గుర్తించినట్టు ఆయన వివరించారు.

నేత్రపర్వంగా మరిడి మహాలక్ష్మి జాతర

▸▸ కొత్తపాలెంలో వినూత్నంగా నిర్వహించిన భక్తులు


అమ్మవారి ఆలయానికి పూజా సామగ్రితో తరలి వెళుతున్న మహిళలు

ఎలమంచిలి, సెప్టెంబరు 26 : మునిసిపాలిటీ పరిధి కొత్తపాలెం వార్డులో గురువారం మరిడి మహాలక్ష్మి జాతరను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వారం రోజుల ముందే పుట్టుక తీసుకువచ్చి రాత్రంతా జాగరణ సంబరాలు జరిపారు. జాతర సందర్భంగా తెల్లవారు జామున గ్రామస్థులంతా కలిసి ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి ఉపారాన్ని (కుంభం) ఊరి పొలిమేరల్లో ఉన్న అమ్మవారికి ఆలయానికి తీసుకు వెళ్లి సమర్పించారు. ఈ సమయంలో కుంభంపై ఎటువంటి దుష్టశక్తులు వాలకుండా ఉండేందుకు కర్రలతో కొట్టుకుంటూ ఆలయానికి వెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భక్తులంతా అక్కడ అమ్మవారికి పూజలు జరిపారు. ఈ వేడుకల్లో భాగంగా మహిళల కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయస్థాయి యోగాకు శ్రీప్రకాష్ విద్యార్థులు


విద్యార్థుల అభినందనలో సీహెచ్‌వీకే నరసింహారావు

పాయకరావుపేట, సెప్టెంబరు 26 : జాతీయ స్థాయి యోగా పోటీలకు పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 21నుంచి 23 వరకు తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పేటలో సీబీఎస్ఈ బోర్డు నిర్వహించిన సౌత్ జోన్ యోగా పోటీల్లో అండర్-17 విభాగంలో ఈ విద్యార్థులు బి.దేవాన్షునాయుడు, జి.సోమసూర్యచరణ్, పి.సోహన్‌శ్రీ, సీహెచ్.జయదీప్, వి.చైతన్య అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారు. దీంతో వచ్చే నెల రెండో తేదీ నుంచి గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు, సంయుక్త సీహెచ్.విజయ్‌ప్రకాష్, యోగా గురువులు సురేష్, జయంతి తదితరులు గురువారం అభినందించారు.

కాలనీలో మృతదేహం దహనంపై ఆందోళన

▸▸ సామాజిక అవసరాలకు స్థలాన్ని కేటాయించినట్టు నివాసితులు వెల్లడి

▸▸ శ్మశానవాటికగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ



ఇన్‌చార్జి తహసీల్దార్ నీరజకు ఫిర్యాదు కాపీ అందిస్తున్న ఇరువాడ గ్రామస్థులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 26 : జగనన్న ఇళ్ల కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని శ్మశానవాటికగా మార్చారని ఆరోపిస్తూ మండలంలోని ఇరువాడ గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లా సతీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో గ్రామంలో సర్వే నెంబరు 162/1లో 60మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. కొంత స్థలాన్ని కమ్యూనిటీ భవన నిర్మాణం, ఇతర అవసరాల నిమిత్తం మినహాయించినట్టు చెప్పారు. ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందగా, సదరు స్థలంలో దహనం చేశారని పేర్కొన్నారు. అక్కడివారు అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఈ స్థలాన్ని పక్కా శ్మశానవాటికగా చేసేందుకు షెడ్డును ఏర్పాటు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాల్సిందిగా వారంతా కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ నీరజతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కాపీలను అందజేశారు.

28 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడలు ప్రారంభం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు అనకాపల్లి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు క్రీడోత్సవాల నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎం నాయుడు తెలిపారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభిస్తారని, డీఈవో వెంకట లక్ష్మమ్మ హాజరుకానున్నారని వివరించారు.

ప్రయాణం దుర్లభం!

... 5వ పేజీ తరువాయి

ప్రయాణమంటే వాహనదారులు, సాధారణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు బీఎన్ రోడ్డును పరిశీలించి, అభివృద్ధి పనులు పునఃప్రారంభానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నప్పటికీ నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకంపై శీతకన్ను

... 5వ పేజీ తరువాయి

రావడంతో ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. తీర ప్రాంతంలో కనీసం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండి, రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటే పర్యాటక శాఖ ద్వారా తీర ప్రాంతాలను పర్యాటక స్పాట్‌లుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ముత్యాలమ్మపాలెం, తంతడి, పూడిమడక, సీతపాలెం, రేవుపోలవరం వంటి విశాలమైన తీర ప్రాంతాలను గుర్తించారు. జిల్లాలో సముద్ర తీరంలో సుమారు 35 ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

బొజ్జన్నకొండ అభివృద్ధికి కేంద్రం నిధులు

అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి సమీపంలోని బొజ్జన్నకొండ ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్నది. కేంద్ర పురావస్తు శాఖ పరిధిలోని ఈ కొండపై బౌద్ధ ఆరామాలు, గుహలో ఏక శిలా స్థూపాలు, రాతి విగ్రహాలు వున్నాయి. కొండపై ఇటుకలతో నిర్మించిన విహారాలు, చైతన్య భిక్షువుల గదులు ఉన్నాయి. పక్కనే వున్న లింగాల కొండపై లెక్కలేనన్ని శిల్పాలు వున్నాయి. ఏటా కనుమ పండగరోజున దేశవిదేశాల నుంచి బౌద్ధ భిక్షువులు వచ్చి ప్రత్యేక మేళాను నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ బొజ్జన్న కొండ అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఏడాది కిందట వరకు బొజ్జన్న కొండకు వెళ్లాలంటే సరైన రోడ్డు లేదు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఇటీవల రోడ్డు నిర్మాణం చేపట్టారు. పర్యాటకుల కోసం రూ.2.5 కోట్లతో ధ్యాన మందిరం, లేజర్ షో థియేటర్‌ను నియమించారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు.

పర్యాటకాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం.. అనకాపల్లి జిల్లాలో ప్రకృతి రమణీయ, సందర్శనీయ ప్రదేశాలను గుర్తించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఏయే ప్రాంతాలను పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేయవచ్చు, ఇప్పటికే పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందిన ప్రదేశాల్లో సందర్శకులకు కల్పించాల్సిన సదుపాయాలు, వీటికి ఎంతమేర నిధులు అవసరం అవుతాయో నివేదిక అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది.

రోజంతా ముసురే

▸▸ అల్పపీడనం వల్ల పలు మండలాల్లో చిరుజల్లులు.. కొన్నిచోట్ల మోస్తరు వర్షం

▸▸ లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు

▸▸ రాకపోకలకు జనం ఇబ్బందులు


అనకాపల్లిలోని పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం పలు మండలాల్లో ముసురు వాతావరణం నెలకొంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోగా, గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి. అనకాపల్లి పట్టణంలో ఉదయం కొద్దిసేపు చిరుజల్లులు కురిశాయి. తరువాత నుంచి ఆకాశం మేఘావృతమై అడపాదడపా చిన్నపాటి చినుకులు పడ్డాయి. అనకాపల్లిలో 18.6 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. రెండు రోజులు నుంచి వర్షాలు కురుస్తుండడం వల్ల రహదారులపై పడిన గుంతల్లో నీరు చేరుతుండడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలో చాలా వరకు వర్షపు నీరు నిలిచిపోయింది. అలాగే విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద కూడా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముసురు కారణంగా రహదారులపై జనసంచారం అంతంత మాత్రంగానే కనిపించింది.

కొత్తూరు : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరులో బుధవారం కురిసిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దీంతో శారదానగర్, సాయినగర్ ప్రధాన వీధుల్లోని రోడ్లపై ఉన్న నీటిని గురువారం సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తొలగించారు. సాయినగర్‌లో ముంపు ప్రాంతాల్లో కాలువలను శుభ్రం చేసి నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు తాడి చక్రవర్తి, పందల శ్రీనివాసరావు, నీటిపల్లి రాజు, మోసూరి నరసింగరావు, పంచాయతీ ఈవో సుభాష్ పాల్గొన్నారు.

పరవాడలో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం


పరవాడ : మండల కేంద్రం పరవాడలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం పదకొండు గంటలకు వరకు మోస్తరు వర్షం కురిసింది. ఈ కారణంగా పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయాధికారిణి సిహెచ్.చంద్రావతి తెలిపారు. పరవాడ ఎస్సీ కాలనీ వాసులు ఇంకా ముంపులోనే ఉన్నారు. పరవాడ, తానాం ప్రాంతాల్లోని పొలాల్లో వరినాట్లు ఊపం దుకున్నాయి. వర్షం కారణంగా ఎల మంచిలి- గాజువాక ప్రధాన రహదారితో పాటు రేఖవానిపాలెం, రాజన్నపాలెం, పచ్చికూరవానిపాలెం, వెంకటాపురం రహదారులు చిత్తడిగా మారాయి. ఈకారణంగా గ్రామీణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే, తాజా వర్షాలకు మండలంలోని పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి.


తాజా వర్షాలకు జలకళను సంతరించుకున్న పరవాడలోని ఊర చెరువు


కొత్తూరు పంచాయతీ సాయినగర్‌లో వర్షపు నీటిని తొలగించే పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

డ్వాక్రా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

▸▸ అర్బన్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయకుమార్


అర్బన్ స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎలమంచిలి, సెప్టెంబరు 26 : స్వయం సహాయక సంఘాల్లో మహిళలు స్వయం ప్రతిపత్తితో ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం ఆవరణలో అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం 250 అర్బన్ స్వయం సహాయక సంఘాలకు రూ.19.5కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సరోజని, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మెప్మా ప్రతినిధి పద్మ, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, కొఠారు సాంబ, కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీను, పల్లా సత్యనారాయణ, గందం శివ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : కొత్తూరు, మామిడివాడ గ్రామాల్లో కొలువుదీరిన పైడితల్లమ్మను ఎమ్మెల్యే విజయకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం స్వగ్రామమైన కొత్తూరు పర్యటించి సర్పంచ్ సాయి ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, నాయకులు బి.మహేష్, మామిడివాడ సర్పంచ్ ఎం.అప్పలనర్స, ఎంపీటీసీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, రాంబిల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.శ్రీనివాసరావు అచ్యుతాపురంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

తుమ్మపాల (మునగపాక) : కూటమి పాలనలో రాష్ట్రం శతశాతం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. మునగపాక మండలం తోటాడ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. వంద రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరుశురాం, నాయకులు మళ్ల జయమ్మ, పొలమరశెట్టి మురళీ, దొడ్డి రమేష్, ఆళ్ల వెంకటేష్, ఆడారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలు గుర్తించండి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, సెప్టెంబరు 26 : మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 28న లే అవుట్ల సందర్శన చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. గురువారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. శనివారం అన్ని గ్రామాల్లో ఉన్న లే అవుట్లను పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవో కె.నరేశ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'పేట' ఎంపీడీవోగా జయప్రకాశరావు


జయప్రకాశరావు

పాయకరావుపేట, సెప్టెంబరు 26 : ఇక్కడి ఎంపీ డీవోగా ఎ.జయప్రకాశరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీడికాడ నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇంత వరకు ఈ స్థానంలో ఉన్న ఎ.ఎ.సాంబశివరావును కె.కోటపాడుకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కొత్త ఎంపీడీవోకు కార్యాలయ ఏవో వర్మ, ఈవోపీఆర్డీ వైవీ సత్యనారాయణతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవీఎంసీ అధికారుల 'స్వచ్ఛతా హీ సేవ'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : భీమునిగుమ్మం ప్రాంతంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్సీతో పాటు ఏపీడీ దొర, పారిశుధ్య విభాగం అధికారులు చీపుర్లు చేతబట్టి రహదారులను శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆర్.రవి, ఎం.అప్పారావు, మాణిక్యాలరావు, సీహెచ్.గణేష్,సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం కళాశాలలో..

సబ్బవరం : ఇక్కడి ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సబ్బవరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణను శుభ్రపర్చారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

కశింకోట, సెప్టెంబరు 26 : రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీనియర్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేష్‌కుమార్ అన్నారు. గురువారం ఇక్కడ మహాజన సభ నిర్వహించారు. తొలుత సభ్యులంతా ప్రస్తుత సంవత్సరం జమ, ఖర్చులకు ఆమోదం తెలపడంతో పాటు, రానున్న సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చ జరిపారు. ప్రస్తుతం సంఘంలో 6,856 మంది సభ్యులు ఉండగా, రూ.15 కోట్లు పైచిలుకు టర్నోవర్‌లో నడుస్తున్నట్టు రాజేష్‌కుమార్ చెప్పారు. సంఘం ముఖ్య కార్యదర్శి ద్వారపురెడ్డి నూకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సి.సి.రాజు, అగ్గాల పైడిరాజు, దాసరి శ్రీనివాసరావు, అల్లూరి పార్థసారధి, రాజు తదితరులతో పాటు సభ్య రైతులు పాల్గొన్నారు.

ఆర్డీఓలు బదిలీ

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసుకున్న షేక్ ఆయేషాను అనకాపల్లి ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న చిన్నికృష్ణను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పాలకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీఓగా బదిలీ చేసి, అక్కడ ఉన్న హనుమంతు జయరాంను ప్రభుత్వానికి కి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టి.శ్రీలేఖను విశాఖపట్నం ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డి.హుస్సేన్‌సాహెబ్ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.సంగీత్‌మాధుర్‌ను భీమునిపట్నం ఆర్డీఓగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఎస్.భాస్కరరెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇంకా వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీఓగా, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీ కలెక్టర్ బి.అఖిలను చీరాల ఆర్డీఓగా, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

పేదలకు పుస్తకాలు పంపిణీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : స్థానిక అమర జీవి పొట్టి శ్రీరాములు భవనంలో గురువారం సాయంత్రం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన పిరాట్ల నరసింహమూర్తి 2006లో రూ.రెండు వేలతో ప్రారంభించిన శాశ్వత విద్యా నిధి రూ.4.5 లక్షలకు చేరుకోవడం, ఆ మొత్తం బ్యాంకులో డిపాజిట్ చేసి తద్వారా వచ్చే వడ్డీతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. చేయూత ఫౌండేషన్ ప్రతినిధి ఈపూరి బుచ్చిరాజు, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎసెన్షియాకు హైలెవెల్ కమిటీ

... 5వ పేజీ తరువాయి

విజయకృష్ణన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా చర్యలు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

పరవాడ ఫార్మాలో..

పరవాడ ఫార్మాసిటీలో ఇటీవల ప్రమాదం జరిగిన సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రీడియంట్స్ పరిశ్రమ యూనిట్-3ను వసుధా మిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలించింది. ప్రమాద వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంకీ కమర్షియల్ హబ్‌లో పరిశ్రమల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ప్రమాదాల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఉన్నత స్థాయి కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్‌వర్మ, పరిశ్రమల శాఖ అదరపు డైరెక్టర్ ఏవీ పటేల్, పీసీబీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరరావు, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రాఘవన్, ఆర్డీఓ చిన్నికృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరి ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగల నెలలో రేషన్ కోత

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. గతంలో బియ్యం, గోధుమ పిండి, కందిపప్పు, పంచదార పంపిణీ చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏడాది కాలంగా కందిపప్పు సరఫరా ఆపేసింది. గోధుమ పిండి పంపిణీ అస్తవ్యస్తంగా వుంది. కాగా సెప్టెంబరు నెలలో బియ్యం మాత్రమే ఇచ్చారు. అక్టోబరులో బియ్యం, పంచదార సరఫరా చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర చుక్కలనంటున్నది. రకాన్నిబట్టి కిలో రూ.180కిపైగానే వుంది. గోధుమ పిండి కిలో రూ.60కి అమ్ముతున్నారు. గతంలో కందిపప్పు కిలో రూ.65, గోధుమ పిండి కిలో రూ.16కి రేషన్ డిపోల ద్వారా ఇచ్చారు. మార్కెట్‌లో మండుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, గోధుమపిండితోపాటు వంట నూనెలు రాయితీపై సరఫరాచేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ


ముత్యాలమ్మకు భక్తుల పూజలు

కశింకోట, సెప్టెంబరు 26 : ఇక్కడి మజ్జివీధి పరిధి పెద్దగుమ్మం వీధిలో దుర్గామాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అచ్యుతాపురంరూరల్ : తిమ్మరాజుపేటలో ముత్యాలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బీజేపీ నాయకులు కర్రి జోగినాయుడు, విజయ్, ద్వారపూడి పరమేశ్వరరావు, మళ్ల కాశేశ్వరరావు, కర్రి రామకృష్ణ, కాండ్రేగుల తేజస్విన్, రాజాన సన్యాసినాయుడు, కూండ్రపు నాయుడు, ఆడారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 26 : నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని విశాఖ స్టీల్‌ప్లాంట్ మాజీ జనరల్ మేనేజర్ డాక్టర్ డి.రామప్రసాద్ అన్నారు. ఇక్కడి డైట్ కళాశాలలో గురువారం మైఖేల్ ఫారడే మెమోరియల్ డేను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మైఖేల్ ఫారడే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగానికి చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థుల సాంకేతిక పరిశోధనల సమాహారంగా ఇన్నోవేటివ్ ఐడియాస్ 23 -24 పుస్తకాన్ని విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం


గ్రామ పెద్దలకు చెక్కు అందిస్తున్న నూతన నాయుడు

సబ్బవరం, సెప్టెంబరు 26 : మండలంలోని టెక్కలిపాలెంలో రామాలయం నిర్మాణానికి ఎన్ఆర్ఐ మేడపురెడ్డి నూతన నాయుడు రూ.10లక్షల చెక్కును గురువారం గ్రామ పెద్దలకు విరాళంగా అందజేశారు. మరో రూ.ఇరవై లక్షలు ఇవ్వనున్న ప్రకటించారు. అంతేకాకుండా గ్రామాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొంప నాయనప్ప, పైల వెంకటరమణ, పంచాడ శ్రీనివాసరావు, పంచాడ దేముడు బాబు, కన్నూరు నారాయణ మూర్తి, దొగ్గ చిన్నయ్య, యడ్ల అప్పలనాయుడు, సబ్బవరపు నాయుడు, పంచాడ శంకరరావు, నరసింహమూర్తి తదిత రులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ

ఎలమంచిలి, సెప్టెంబరు 26 : జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శాస్త్రితో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకా వేతనం అందుతుందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆనంద్, కార్యదర్శి జయ ప్రకాష్, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, రమణ, అప్పలనాయుడు, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాసు, ఎస్ఎంసీ చైర్మన్ జగ్గారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు పోతిరెడ్డిపాలెం సాయం

ఎలమంచిలి, సెప్టెంబరు 26 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామస్థులంతా కలిసి రూ.74 వేలను పోగుచేశారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, పలువురు గ్రామస్థులు కలిసి గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిసి అందజేశారు. కలెక్టర్ పిలుపు మేరకు ఈ విరాళాన్ని సేకరించి సీఎం సహాయ నిధికి పంపుతున్నట్టు సర్పంచ్ తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన 'బుద్ద'


నారా లోకేశ్‌తో బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను విశాఖపట్నం విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లారు.

ఘనంగా కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలు


బుజ్జి బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న శివదత్ తదితరులు

నక్కపల్లి, సెప్టెంబరు 26 : ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్, టీడీపీ నేత కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలు గురువారం ఉపమాకలో ఘనంగా జరిగాయి. అభిమానులు, పార్టీ నాయకులు వెంకన్న ఆలయంలో ఆయన పేరిట పూజలు నిర్వహించారు. అనంతరం జన్మదిన వేడుకలను జరిపారు. పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడ పాటి శివదత్, టీడీపీ నియోజకవర్గ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, లాలం కాశీనాయుడు, అబద్దం, ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, జడ్పీ-కో ఆప్షన్ మాజీ సభ్యుడు కొండ బాబు, కొప్పిశెట్టి వాసు, జగదీశ్వరరావు, తోలేటి శ్రీను తదితరులతో పాటు కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్‌చేసి బుజ్జికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నాలుగు నెలలుగా వేతనాలు లేవు

సమగ్ర శిక్షణ అభియాన్ సొసైటీ కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన


జీతాలు ఇవ్వాలంటూ కోరుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

గొలుగొండ, సెప్టెంబరు 26 : తమకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని సమగ్ర శిక్షణ అభియాన్ సొసైటీలో పనిచేస్తున్నకాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ యూనియన్ నాయకుడు రాయపురెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ వేతనాలు అందక ఉద్యోగులు అర్థాకలితో పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నూకరాజు, వాణి, సరస్వతి, సత్యనారాయణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డి.పట్టా భూముల పరిశీలన


డి.పట్టా భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం, సెప్టెంబరు 26 : డి.పట్టా భూములు ఉన్న రైతులు వారి దగ్గర ఉన్న పత్రాలతో భూముల వద్ద ఉండాలని రెవెన్యూ విచారణ అధికారి, ఎస్.రాయవరం తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పైడిపాలలో డి.పట్టా భూములను ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో డి.పట్టా భూములు జిరాయితీ భూములుగా మార్పు చేయాలని ఇచ్చిన జీవోతో ఈ భూముల్ని వైసీపీ నాయకులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే విమర్శల నేపథ్యంలో ఈ విచారణ చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మాకవరపాలెం, పైడిపాల, లచ్చన్నపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో డి.పట్టా భూములను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం ఆదివాసీల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న ఆదివాసీలు


రావికమతం, సెప్టెంబరు 26 : తమకు ఉచిత విద్యుత్ కనెక్షన్ల మంజూరు విషయంలో స్థానిక విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆదివాసీలు గురువారం కల్యాణపులోవలో నిరసన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ పీవీటీజీ, ఆదివాసీ కొండు గిరిజనులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశాలున్నాయన్నారు. చీమలపాడు పంచాయతీ శివారు కల్యాణపులోవలో ఐదు ఆదివాసీ కుటుంబాలకు జన్‌దమ్ పథకంలో ఉచిత విద్యుత్ కనెక్షన్లు కోసం కుల ధ్రువీకరణ పత్రాలతో సహ గత రెండు నెలల క్రితమే రావికమతం ఏఈకి దరఖస్తులు చేశారన్నారు.వీరికి ఫ్రీ కనెక్షన్లు ఇవ్వాల్సి రావికమతం ఏఈ పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గెమ్మిలి వాసు, రాజు, జంబు తదితరులు పాల్గొన్నారు.

యాత, కల్లుగీత కార్మికుల హర్షం


కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం ప్రకటిస్తున్న యాత, కల్లుగీత కార్మికులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 : తమకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొందని పేర్కొంటూ యాత, కల్లుగీత కార్మికులు హర్షం వ్యక్తం చేసినట్లు బీసీ యాతసాధికార రాష్ట్ర సభ్యులు, కల్లుగీత కార్మికుల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మాడుగుల, చీడికాడ మండలాల కల్లుగీత కార్మికులు అప్పలరాజుపురంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు పదిశాతం రిజర్వేషన్ మద్యం దుకాణాలను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల యాత కులస్థులు, కల్లుగీత కార్మికులకు వ్యాపార, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ యాతసాధికార రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాస్, సభ్యులు పిల్లి శివ, కక్కల కోటేశ్వరరావు, నారాయణరావు, అప్పారావు, రామునాయుడు, కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణం దుర్లభం!


బుచ్చెయ్యపేట : బూదిరెడ్లపాలెం వద్ద బురదమయమైన ప్రధాన రహదారి

... 5వ పేజీ తరువాయి

ప్రయాణమంటే వాహనదారులు, సాధారణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు బీఎన్ రోడ్డును పరిశీలించి, అభివృద్ధి పనులు పునఃప్రారంభానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నప్పటికీ నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పండగల నెలలో రేషన్ కోత

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. గతంలో బియ్యం, గోధుమ పిండి, కందిపప్పు, పంచదార పంపిణీ చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏడాది కాలంగా కందిపప్పు సరఫరా ఆపేసింది. గోధుమ పిండి పంపిణీ అస్తవ్యస్తంగా వుంది. కాగా సెప్టెంబరు నెలలో బియ్యం మాత్రమే ఇచ్చారు. అక్టోబరులో బియ్యం, పంచదార సరఫరా చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర చుక్కలనంటున్నది. రకాన్నిబట్టి కిలో రూ.180కి పైగానే వుంది. గోధుమ పిండి కూడా కిలో రూ.60కి అమ్ముతున్నారు. గతంలో కందిపప్పు కిలో రూ.65, గోధుమ పిండి కిలో రూ.16కి రేషన్ డిపోల ద్వారా ఇచ్చారు. మార్కెట్‌లో మండుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, గోధుమపండితోపాటు వంటనూనెలు కూడా రాయితీపై సరఫరా చేయాలని కార్డుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీతాలు, పింఛన్ల కోసం వేచి చూసే దుస్థితి లేదు

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


చోడవరం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు


మాడుగుల రూరల్ : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి

చోడవరం, సెప్టెంబరు 26 : ఒకటో తేదీకి జీతాలు వస్తాయో.. రావోనన్న సందేహం, తమ పింఛన్లు అందుతాయో లేదో అన్న ఆందోళన లేకుండా కూటమి ప్రభుత్వ హయాంలో ఇటు ఉద్యోగులు, అటు పింఛనుదారులు హాయిగా ఉన్నారని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మధ్యాహ్నం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. బీఎన్ రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రాధాన్యతక్రమంలో సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్స్ మాజీ చైర్మన్ మల్లునాయుడు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ అంబటి రామారావు, సర్పంచ్ నూకరత్నం, ఈవో నారాయణరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో అంతా మంచి

- మాడుగుల ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్ : కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని లోవ కృష్ణాపురం నుంచి కామకూటం వెళ్లేందుకు కొత్తగా వేసిన తారు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లోవ పొన్నవోలులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలోని ఏ ఇబ్బందులు ఇప్పుడు ఉండవన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, రాయపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

తాటి దుంగే హెచ్చరిక బోర్డు..

» ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


రోడ్డు మధ్యలో గుంతలో ఏర్పాటు చేసిన తాటి దుంగ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 26 : గుంతలు పడిన రోడ్లపై అధికారులు దృష్టి సారించకపోవడంతో 'ఎక్కడ గొయ్యి ఉందో..' అన్న విషయం అర్థం కావడం లేదు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు 'చిన్న గొయ్యే కదా' అనే ఉద్దేశంతో వాహనాన్ని ముందుకు పోనిచ్చి ప్రమాదం బారిన పడుతున్నారు.

మండలంలోని వడ్డాది-పాడేరు ఆర్ అండ్ బీ రోడ్డులో భాగమైన ఎం.కోటపాడు సమీపంలో రోడ్డుపై భారీ గొయ్యి పడింది. వర్షాలు కురుస్తుండడంతో గుంతలో నీరు చేరింది. గొయ్యి పడిన ప్రదేశంలో ఎక్కువ లోతుగా ఉండడంతో ప్రయాణికులు దాటుకుని వెళ్లేందుకు భయపడిపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ అవస్థను గమనించిన కొందరు ఓ తాటి దుంగను తీసుకొచ్చి గుంతలో పెట్టి దానిపై ప్లాస్టిక్ గోనె సంచిని పెట్టి హెచ్చరిక బోర్డుగా ఏర్పాటు చేశారు. దీనివల్ల పగటి పూట కొంత వరకు ప్రమాదాలు జరగకున్నా.., రాత్రి వేళల్లో మాత్రం ఆ దంగను గమనించలేక వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.8.37 కోట్లతో వాలాబు పంచాయతీలో రోడ్లు

» మాడుగుల ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, సెప్టెంబరు 26 : కూటమి వంద రోజులు పాలనలోనే వాలాబు గిరిజన పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు మంజూరు చేయడం తమ ప్రభుత్వ సమర్థ పనితీరుకు నిదర్శనమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి పేర్కొన్నారు. ఆయన గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వాలాబు పంచాయతీ పరిధిలోని 8 గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం రోడ్ల నిర్మాణానికి రూ.8.37 కోట్లు మంజూరు అయినట్టు తెలిపారు. వాలాబు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కోడాపల్లి గ్రామానికి సీసీరోడ్డు నిర్మాణానికి రూ.87 లక్షలు, కోడాపల్లి నుంచి రామన్నపాలెం గ్రామానికి రూ.83 లక్షలు, పూల గరువు గ్రామానికి రూ.కోటి ఏడు లక్షలు, బుచ్చంపాలెం రూ.కోటి ఇరవై లక్షలు, బొర్ర చింత రూ.87లక్షలు, కేటీపాలెం మీదుగా గొడుగు మామిడి (చీడికాడ మండలం) రూ.కోటి 83 లక్షలు, బొడ్డగుమ్మి గ్రామానికి రూ.కోటి 60 లక్షలు, విప్పగరువు రూ.పది లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల వాలాబు గిరిజన గ్రామాలు సందర్శించి నెల వ్యవధిలోనే నిధులు మంజూరు చేయడంపై సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

పలు ప్రాంతాల్లో వర్షం


చోడవరంలో కురుస్తున్న వర్షం

చోడవరం, సెప్టెంబరు 26 : అల్పపీడన ప్రభావంతో గురువారం మధ్యాహ్నం పట్టణంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నానికి కారుమబ్బులు కమ్మి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్ పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో గురువారం వర్షం పడింది. దీంతో చెరువులు, బొడ్డేరు గెడ్డలు నీటితో కళకళలాడుతున్నాయి.వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. ఏఎల్‌పురం-కొంగసింగి, ఏఎల్‌పురం-పాతకృష్ణాదేవిపేట రహదారులు గోతుల్లో వర్షంనీరు రోడ్డుపై అధ్వానంగా మారాయి.దీంతో ప్రయాణికు లకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు కృష్ణాదేవిపేట మీదుగా తాండవలో చేరుకునే బొడ్డేరు గెడ్డలో వర్షపునీటి ఉధృతంగా ప్రవహిస్తోంది.


మాడుగుల రూరల్ : కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణం కమ్ముకొంది. ఉదయం పదిగంటలకే తేలికపాటి జల్లులతో ఆరంభమై గంటన్నరసేపు మోస్తరు వర్షం పడింది. మండలంలో 4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మాకవరపాలెం : మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని బస్టాండ్ వర్షపు నీరుతో జలమయమైంది. బస్టాండ్ ఆవరణలో గోతులు ఉండడంతో వాటిల్లో వర్షం నీరు చేరి చెరువులా కనిపిస్తోంది. ఆ ప్రాంగణమంతా బురదగా మారింది. బస్టాండ్ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గోవాడ చెరకు రైతుల కార్మికుల బకాయిలు చెల్లించాలి

రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు



చోడవరం, సెప్టెంబరు 26 : గోవాడ చెరకు రైతుల కార్మికుల బకాయిలు మహాజన సభకు ముందుగానే చెల్లించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు, చెరకు రైతుల బకాయిలతో పాటు, కార్మికుల బకాయిలు, మృతి చెందిన సభ్య రైతుల బీమా పరిహారం కూడా అందించాలని డిమాండ్ చేశారు. వచ్చే సీజన్‌కు చెరకు టన్నుకు రూ.4 వేలు మద్దతు ధర చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు జిల్లా నాయకులు బేరా జగదీశ్వరరావు, అయితిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి ప్రభో..!

రామచంద్రపురం వాసుల ఆందోళన


ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 26 : గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ పరిధి రామచంద్రపురంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గురువారం తాగునీటి సమస్యపై సోలార్ బోరు ట్యాంక్ వద్ద మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో సుమారు 280 మంది జనాభా ఉన్నారు. వీరందరికీ ఐదువేల లీటర్ల సోలార్ వ్యాటర్ ట్యాంక్, రెండు చేతి బోర్లు ఉన్నాయి. వీటిలో ఒకటి కొత్త చేతి బోరు కావటంతో బురదనీరు వస్తోంది. మరొకటి కొన్ని నెలల కిందట మరమ్మతుకు గురైంది. ప్రస్తుతం ఉన్న సోలార్ వాటర్ ట్యాంక్ వాతావరణ మార్పులతో గత రెండు రోజులుగా తాగునీరు పూర్తి స్థాయిలో రాలేదు. దీంతో మహిళలు సమీప వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్ళి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఈ పంచాయతీలో రూ.10 కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి మండలంలో సుమారు 20 గ్రామాలకు ఇంటింటి తాగునీరు అందిస్తున్నారు. అయితే ఈ గ్రామానికి మాత్రం ఆనీటి సౌకర్యం అందుబాటులోకి రాలేదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్డీఓలు బదిలీ

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసుకున్న షేక్ ఆయేషాను అనకాపల్లి ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న చిన్నికృష్ణను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పాలకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీఓగా బదిలీ చేసి, అక్కడ ఉన్న హనుమంతు జయరాంను ప్రభుత్వానికి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న టి.శ్రీలేఖను విశాఖపట్నం ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డి.హుస్సేన్ సాహెబ్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ శిక్షణ ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.సంగీత్ మాదుర్‌ను భీమునిపట్నం ఆర్డీఓగా నియమించి, అక్కడ పనిచేస్తున్న ఎస్.భాస్కరరెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఇంకా వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తిని విజయనగరం ఆర్డీఓగా, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీకలెక్టర్ అఖిలను చీరాల ఆర్డీఓగా, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యవాణిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

పర్యాటకంపై శీతకన్ను

... 5వ పేజీ తరువాయి

రావడంతో ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. తీర ప్రాంతంలో కనీసం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండి, రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటే పర్యాటక శాఖ ద్వారా తీర ప్రాంతాలను పర్యాటక స్పాట్‌లుగా అభివృద్ధి చేయా లని ప్రతిపాదించారు. ముత్యాలమ్మ పాలెం, తంతడి, పూడిమడక, సీతపాలెం, రేవుపోల వరం వంటి విశాలమైన తీర ప్రాంతాలను గుర్తించారు. జిల్లాలో సముద్ర తీరంలో సుమారు 35 ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు కార్య రూపం దాల్చలేదు.

బొజ్జన్నకొండ అభివృద్ధికి కేంద్రం నిధులు

అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి సమీపంలోని బొజ్జన్నకొండ ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్నది. కేంద్ర పురావస్తు శాఖ పరిధిలోని ఈ కొండపై బౌద్ధ ఆరామాలు, గుహలో ఏకశిలా స్థూపాలు, రాతి విగ్రహాలు వున్నాయి. కొండపై ఇటుకలతో నిర్మించిన విహారాలు, చైతన్య భిక్షువుల గదులు ఉన్నాయి. పక్కనే వున్న లింగాల కొండపై లెక్కలేనన్ని శిల్పాలు వున్నాయి. ఏటా కనుమ పండగరోజున దేశవిదేశాల నుంచి బౌద్ధ భిక్షువులు వచ్చి ప్రత్యేక మేళాను నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ బొజ్జన్న కొండ అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఏడాది కిందట వరకు బొజ్జన్న కొండకు వెళ్లాలంటే సరైన రోడ్డు లేదు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఇటీవల రోడ్డు నిర్మాణం చేపట్టారు. పర్యాటకుల కోసం రూ.2.5 కోట్లతో ధ్యాన మందిరం, లేజర్ షో థియేటర్‌ను నియమించారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు.

పర్యాటకాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం.. అనకాపల్లి జిల్లాలో ప్రకృతి రమణీయ, సందర్శనీయ ప్రదేశాలను గుర్తించి పర్యాట కంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఏయే ప్రాంతాలను పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేయవచ్చు, ఇప్పటికే పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందిన ప్రదేశాల్లో సందర్శకులకు కల్పించాల్సిన సదుపాయాలు, వీటికి ఎంతమేర నిధులు అవసరం అవుతాయో నివేదిక అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది.

ఎసెన్షియాకు హైలెవెల్ కమిటీ

... 5వ పేజీ తరువాయి

విజయకృష్ణన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా చర్యలు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

పరవాడ ఫార్మాలో..

పరవాడ ఫార్మాసిటీలో ఇటీవల ప్రమాదం జరిగిన సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రీడియంట్స్ పరిశ్రమ యూనిట్-3ను వసుధా మిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలించింది. ప్రమాద వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంకీ కమర్షియల్ హబ్‌లో పరిశ్రమల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ప్రమాదాల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉన్నతస్థాయి కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్‌వర్మ, పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ ఏవీ పటేల్, పీసీబీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరరావు, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రాఘవన్, ఆర్డీవో చిన్నికృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండగ

చీడికాడ, సెప్టెంబరు 26 : మండలంలోని మంచాల, ఎన్.గద బూరు, శిరిజాం గ్రామాల్లో గురువారం పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ పండగను ప్రతి ఏడాది ఉత్తరకార్తెలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పండగ ద్వారా పశువులో ఆరోగ్యంగా ఉండటంతో పాటు రైతుకు మేలు చేకూర్చుతాయనే నమ్మకంతో పండగ ను ఘనంగా నిర్వహిస్తారు. మంచాల గ్రామంలో జరిగిన పండగలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆసక్తిగా తిలకించారు.

☛ సంక్షిప్తంగా..

రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమ

రోలుగుంట, సెప్టెంబరు 26 : ఇటీవల వరదలకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని విడుదల చేసినట్టు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇటీవల కురిసిన వరదలకు పడాలపాలెం, కొమరవోలు గ్రామాల్లో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసి 53 మంది రైతులకు చెందిన 9.29 హెక్టార్లలోపంట దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు. ఆయా రైతుల ఖాతాల్లో రూ.2.32 లక్షల నష్ట పరిహారం కింద జమచేసినట్లు ఏవో తెలిపారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక


రోలుగుంట, సెప్టెంబరు 26 : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023, ఏప్రిల్ నుంచి 2024, మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో సూర్యమణి తెలిపారు. 24 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఇప్పటికే తనిఖీలు నిర్వహించి గ్రామస్థాయిలో సోషల్ ఆడిట్‌లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని అన్ని పంచాయతీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఎంపీడీవోగా విజయలక్ష్మి


ఎంపీడీవోను విజయలక్ష్మిని అభినందిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 26 : బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా విజయలక్ష్మి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె అచ్యుతాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు. అలాగే ఎంపీడీవోను వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు, కార్యదర్శులు సత్యనారాయణ, రాము, జ్యోతిరెడ్డి తదితరులు కలిశారు.

చీడికాడ తహసీల్దార్‌గా ప్రసాద్



చీడికాడ, సెప్టెంబరు 26 : చీడికాడ తహసీల్దార్‌గా వైవీఎస్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ఓడీఎస్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఉన్న తహసీల్దార్ బీవీ రాణి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి పరిపాలన అధికారిగా వెళ్లారు.

బాక్సింగ్‌లో విజేతకు అభినందనలు


మౌనికకు అభినందిస్తున్న టీచర్లు

నర్సీపట్నం, సెప్టెంబరు 26 : ఇటీవల గౌహతిలో జరిగిన నేషనల్ బాక్సింగ్ పోటీల్లో బంగారం పతకం సాధించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బొంతు మౌనికను ప్రిన్సిపాల్ ఎస్.రాజు, పీడీ, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో నింజాస్ అకాడమీ ప్రతినిధులు నారాయణరావు, కోచ్ అబ్బు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా సురేష్

రావికమతం, సెప్టెంబరు 26 : రావికమతం మండల నూతన సర్వేయర్‌గా నియమితులైన పి.సురేష్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా సీతమ్మధార మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ ఆర్.సత్యనారాయణ సీతమ్మధారకు బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, సెప్టెంబరు 26 : దేవరాపల్లి సబ్ స్టేషన్ నుంచి పినకోట ఫీడర్‌లో నాలుగు పంచాయతీలకు శుక్రవారం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. విద్యుత్ పనులు చేపడుతుండడంతో శ్రీరాంపురం, జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎంపీ రమేశ్‌కు మాజీ ఎంపీపీ కిలపర్తి అభినందనలు


రమేశ్‌కు అభినందనలు తెలుపుతున్న కిలపర్తి

దేవరాపల్లి, సెప్టెంబరు 26 : రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మొల్లి కృష్ణమూర్తి, పలువురు నేతలు ఉన్నారు.

కె.కోటపాడు : రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నియమితులు కావడం పట్ల జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మాజీ డైరెక్టర్, సీనియర్ బీజేపీ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన

దేవరాపల్లి, సెప్టెంబరు 26 : స్థానిక మొండి వీధిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ కృష్ణమూర్తి, కొల్లి ఈశ్వరరావు, మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.